తొలి రౌండ్‌లోనే సింధు ఔట్

• ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంప్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు భారీ షాక్ తగిలింది. గాయం తర్వాత కోలుకుని బరిలోకి దిగిన ఈ డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్.. తొలి రౌండ్‌లోనే నిష్క్రమించి నిరాశపరిచింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో సింధు 21-19, 13-21, 13-21తో కొరియా అమ్మాయి కిమ్ గ యున్ చేతిలో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో 20-12తో తిరుగులేని ఆధిక్యంలో ఉన్న సింధు.. ఆ తర్వాత కిమ్ అనూహ్య పోరాటంతో వెనుకడుగు వేసింది. తొలి గేమ్ ఆఖర్లో పుంజుకున్న కిమ్.. వరుసగా రెండు గేమ్‌లు గెలుచుకుని సింధును ఇంటికి పంపించింది. మిగిలిన మ్యాచ్‌ల విషయానికొస్తే.. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక-రోహన్ జంట 21-10, 17-21, 24-22తో తైవాన్ జోడీ యూ హాంగ్ వీ-నికోల్ చన్‌ను మట్టికరిపించి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-త్రిసా 21-17, 21-13తో సుంగ్ షువొ యున్-చెన్ సు యు (తైవాన్)ను చిత్తు చేశారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 20-22, 18-21తో డానియల్ లడ్‌గార్డ్, మాడ్స్ వెడ్‌గార్డ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. దీంతో లీగ్ దశలోనే సాత్విక్, చిరాగ్ పోరాటం ముగిసినట్లయ్యింది.

రోహిత్ @3

గిల్‌కు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు

దుబాయ్: ఇటీవలే ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో 76 పరుగులతో భారత విజయంలో కీలకపాత్ర పోషించిన టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకుల్లో మూడో ర్యాంక్‌కు ఎగబాకాడు. గత వారం ఐదో స్థానంలో ఉన్న రోహిత్.. న్యూజిలాండ్‌తో పోరులో రాణించడంతో రెండు స్థానాలు మెరుగుపరుచుకోవడమే గాక ఐదో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీనీ అధిగమించాడు. బ్యాటర్ల జాబితాలో శుభ్‌మన్ గిల్.. 784 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టాప్-10లో భారత్ నుంచి గిల్, రోహిత్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (8) నలుగురు చోటు దక్కించుకున్నారు. ఫిబ్రవరి నెలకు గాను గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు దక్కింది.

గంభీర్ ముందుగానే..

ఢిల్లీ: ఈ ఏడాది జూన్ నుంచి ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్.. ప్రధాన జట్టు కంటే ముందే ఆ దేశానికి వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నాడు. ప్రధాన ఆటగాళ్లంతా ఐపీఎల్‌తో బిజీగా గడిపే సమయంలో భారత 'ఏ' జట్టు ఇంగ్లండ్‌కు వెళ్లనుండగా.. ఆ జట్టుతో కలిసి గంభీర్ వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. ముందే వెళ్లడం వల్ల రిజర్వ్ బెంచ్‌ను మరింత బలోపేతం చేసుకోవచ్చునని, ఎవరి సత్తా ఏమిటో తెలుసుకునేందుకు ఇదొక చక్కటి అవకాశమని గంభీర్ అనుకుంటున్నాడు. ఇదే విషయాన్ని అతడు ఆస్ట్రేలియా పర్యటన నుంచి వచ్చిన వెంటనే బీసీసీఐతో జరిగిన సమావేశంలో చర్చించినట్టు బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. ఒకవేళ గంభీర్ గనక భారత 'ఏ' జట్టుతో వెళ్తే అలా వెళ్లిన తొలి హెడ్‌కోచ్‌గా నిలుస్తాడు. రవిశాస్త్రి హెడ్‌కోచ్‌గా ఉన్నప్పుడు భారత 'ఏ' టూర్లకు రాహుల్ ద్రవిడ్ వెంట వెళ్లేవాడు. ద్రవిడ్ కోచ్ అయ్యాక ఆ బాధ్యతలను వీవీఎస్ లక్ష్మణ్ చూసుకున్నాడు.

మహ్మదుల్లా రిటైర్మెంట్

ఢాకా: బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్ మహ్మదుల్లా అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు అతడు బుధవారం సోషల్ మీడియా వేదికలలో తన నిర్ణయాన్నివెల్లడించాడు. 2007లో బంగ్లాదేశ్ జట్టులో అరంగేట్రం చేసిన మహ్మదుల్లా.. సుదీర్ఘ కెరీర్‌లో 239 వన్డేలు ఆడి 5,689 పరుగులు చేశాడు. 50 టెస్టులు, 141 టీ20లలో ప్రాతినిధ్యం వహించిన మహ్మదుల్లా.. మూడు పార్మాట్లలో కలిపి పదివేలకు పైగా పరుగులు సాధించాడు.

ఈనెల 15 నుంచి సెలెక్షన్ ట్రయల్స్

ఢిల్లీ: సుమారు 15 నెలల విరామం తర్వాత తమపై విధించిన నిషేధాన్ని ఎత్తేసిన మరుసటి రోజే భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) రాబోయే ఆసియన్ చాంపియన్‌షిప్స్ కోసం సన్నాహకాలు మొదలుపెట్టింది. మార్చి 25-30 మధ్య జోర్డాన్‌లోని అమ్మన్ వేదికగా జరగాల్సి ఉన్న ఈ పోటీలకు గాను ఈనెల 15 నుంచి సెలెక్షన్ ట్రయల్స్‌ను నిర్వహించనుంది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మెన్స్ ఫ్రీస్టయిల్, ఉమెన్స్ రెజ్లింగ్, గ్రీకో-రోమన్ స్టయిల్ విభాగాల్లో సెలెక్షన్స్ జరుగుతాయని డబ్ల్యూఎఫ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది.

క్వార్టర్స్‌కు బాంబ్రీ

కాలిఫోర్నియా: భారత టెన్నిస్ ఆటగాడు యుకీ బాంబ్రీ, ఆండ్రే గొరన్సన్ (స్వీడన్) ద్వయం ఇండియానా వెల్స్ ఓపెన్‌లో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. బుధవారం ఇక్కడ జరిగిన ప్రిక్వార్టర్స్ పోరులో బాంబ్రీ-గొరన్సన్ ద్వయం 6-2, 5-7, 10-5తో హెలొవర (ఫిన్‌లాండ్)-పాటెన్ (యూకే) జోడీని మట్టికరిపించింది. గురువారం జరుగబోయే క్వార్టర్స్‌లో బాంబ్రీ-గొరన్సన్ జోడీ.. స్మిత్ (ఆస్ట్రేలియా)- ఫెర్నాండో రొంబొలి (బ్రెజిల్)ను ఢీకొననుంది.

అబిద్ అలీ అస్తమయం

కన్నుమూసిన భారత దిగ్గజ క్రికెటర్

పలువురు సంతాపం



న్యూఢిల్లీ: సుదీర్ఘ భారత క్రికెట్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. తన ఆల్‌రౌండ్ నైపుణ్యంతో దేశానికి చిరస్మరణీయ విజయాలు అందించిన భారత దిగ్గజ క్రికెటర్ సయ్యద్ అబిద్‌అలీ(83) కన్నుమూశారు. గత కొంత కాలంగా వయసు సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న అలీ బుధవారం అమెరికాలోని కాలిఫోర్నియాలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని నార్త్ అమెరికా క్రికెట్ లీగ్(ఎన్ఏసీఎల్) ఒక ప్రకటనలో పేర్కొంది. 1960-70 దశకంలో భారత్ తరపున ఆడిన అలీ ఆల్‌రౌండర్‌గా అనితర సాధ్యమైన సేవలందించారు. హైదరాబాద్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్లు ఎమ్ఏకే పటౌడీ, ఎమ్ఎల్ జైసింహా, అబ్బాస్ అలీ బేగ్ వంటి వారితో కలిసి ఆడిన అబిద్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 1967లో ఆస్ట్రేలియాపై అడిలైడ్‌లో భారత టెస్టు జట్టులోకి అరంగేట్రం చేసిన అలీ తన తొలి మ్యాచ్‌లోనే ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటారు. తొలి ఇన్నింగ్స్‌లో 6/55 ప్రదర్శనతో కెరీర్ బెస్ట్ నమోదు చేసుకున్నారు. సిడ్నీలో జరిగిన మరో టెస్టులో 78, 81 పరుగులతో రాణించి ఔరా అనిపించారు. 1967-1974 మధ్య కాలంలో భారత్‌కు 29 టెస్టులాడిన అలీ 1,018 పరుగులతో పాటు 47 వికెట్లు పడగొట్టారు. వికెట్ల మధ్య చిరుతను తలపించే అలీ..మెరుపు ఫీల్డర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. పలు మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా తరపున అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో ఓపెనింగ్ చేసే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. దేశం తరపున ఆడింది ఐదు వన్డేలైనా..వాటిపై చెరగని ముద్ర వేశారు. 1974లో అజిత్ వాడేకర్ సారథ్యం వహించిన భారత్‌కు అలీ తొలి వన్డే మ్యాచ్ ఆడారు. 1975 ప్రపంచ కప్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఆడారు. ఇక దేశవాళీ విషయానికొస్తే..హైదరాబాద్ తరపున 212 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన అబిద్ అలీ 8,732 పరుగులతో పాటు 397 వికెట్లు తీశారు. 173 నాటౌట్, 6/23 అత్యుత్తమ ప్రదర్శనగా నమోదు చేసుకున్నారు.

షెహర్‌కీ షాన్!

1941, సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో పుట్టిన అబిద్ అలీ బంతితో, బ్యాట్‌తో, అద్భుతమైన ఫీల్డర్‌గాను గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపు దశాబ్దానికి పైగా హైదరాబాద్ తరపున ఆయన ఆడారు. దిగ్గజ క్రికెటర్ ఎమ్ఎల్ జైసింహాను గురువుగా భావించే అలీతో కలిసి ఎల్బీ స్టేడియంలో ప్రాక్టీస్ చేశారు. జైసింహా సలహాతోనే తన బౌలింగ్ యాక్షన్‌లో మార్పులు చేసుకున్నానని పేర్కొనారు. 1959-60 సీజన్‌లో ఆంధ్రపై అరంగేట్రం చేసిన అలీ అనతికాలంలోనే ఆల్‌రౌండర్‌గా ఎదిగారు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్, ఫీల్డింగ్‌లో తనదైన పాత్ర పోషిస్తూ జట్టుకు చిరస్మరణీయ విజయాలందించారు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత హైదరాబాద్, ఆంధ్ర సహా అమెరికాలో యువ క్రికెటర్లను తీర్చిదిద్దారు. భారత, హైదరాబాద్ క్రికెట్‌లో ఆ రోజుల్లో అలీని అందరూ ముద్దుగా 'చిచ్చా' అని పిలుచుకునేవారు.

> సయ్యద్ అబిద్ అలీ సాబ్ మృతికి నా ప్రగాఢ నివాళి. నిజమైన హైదరాబాదీ క్రికెట్ దిగ్గజం. ఆల్‌రౌండర్‌గా ఆయన ఆట, తెగువ అమోఘం, భారత క్రికెట్‌పై అలీ చెరగని ముద్ర వేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.
>
> – కేటీఆర్, మాజీ మంత్రి

ఢిల్లీని ఢీకొట్టేదెవరు?

నేడు ముంబై- గుజరాత్ ఎలిమినేటర్ • గెలిచిన జట్టు ఫైనల్‌కు

ఈ మ్యాచ్ లైవ్‌ను స్టార్ (టీవీ), జియో హాట్‌స్టార్ (యాప్)లో చూడొచ్చు

ముంబై: దాదాపు నెల రోజులుగా క్రికెట్ అభిమానులను విశేషంగా అలరిస్తున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. ఈ మెగా టోర్నీలో మిగిలిఉంది ఇక రెండు మ్యాచ్‌లే. లీగ్ దశ మంగళవారమే ముగియగా 5 విజయాలతో టేబుల్ టాపర్‌గా ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడోసారి ఫైనల్ చేరింది. ఇక తొలి ఎడిషన్ విన్నర్ ముంబై ఇండియన్స్.. మూడోసారి ఎలిమినేటర్ పోరుకు సిద్ధమైంది. తొలి రెండు సీజన్లలో ఘోరంగా విఫలమైనప్పటికీ సారథ్య మార్పుతో గుజరాత్ జెయింట్స్ తొలిసారిగా నాకౌట్ దశకు అర్హత సాధించింది. గురువారం ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం వేదికగా ముంబై-గుజరాత్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన విజేత.. ఈనెల 15న ఇదే వేదికపై ఢిల్లీతో జరిగే ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది.

ఫేవరైట్‌గా ముంబై

2024లో ఆడిన 8 మ్యాచ్‌లలో ఐదు మ్యాచ్‌లను గెలుచుకున్న ముంబై.. ఈ సీజన్‌లో గుజరాత్‌తో తలపడ్డ రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ పరంగా గుజరాత్ కంటే ముంబై మెరుగ్గానే ఉంది. ఈ సీజన్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్న సీవర్ బ్రంట్.. 8 మ్యాచ్‌లలో ఏకంగా 69.33 సగటుతో 416 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ హీలి మాథ్యూస్.. బ్యాట్‌తో 227 పరుగులు సాధించడమే గాక బంతితో 14 వికెట్లు పడగొట్టి టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఉంది. హర్మన్‌ప్రీత్ ఆరంభ మ్యాచ్‌లలో విఫలమైనా గత నాలుగు మ్యాచ్‌ల నుంచి నిలకడగా ఆడుతూ ఫామ్‌లోనే ఉంది. ఇక స్పిన్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్ 14 వికెట్ల పడగొట్టడంతో పాటు బ్యాట్‌తోనూ విలువైన పరుగులు చేస్తోంది. ఎలిమినేటర్ పోరులోనూ ముంబై ఈ నలుగురు మరోసారి సత్తా చాటుతారని ఆశిస్తోంది. తొలి ఎడిషన్‌లో ఫైనల్ చేరడమే గాక కప్పు కొట్టిన ముంబై.. రెండో సీజన్‌లో బెంగళూరు చేతిలో ఓడిపోయింది.

ఆ ముగ్గురిపైనే జెయింట్స్ ఆశలు

బెత్ మూనీ నుంచి సారథ్య పగ్గాలు అందుకున్న గార్డ్‌నర్.. కెప్టెన్‌గా విజయవంతమైంది. జట్టు ఆటతీరును పూర్తిగా మార్చిన ఆమె.. కెప్టెన్‌గా అటు బంతితో పాటు బ్యాట్‌తోనూ సత్తా చాటుతోంది. ఎలిమినేటర్‌లోనూ ఆమె చెలరేగితే ముంబైకి తిప్పలు తప్పవు. ఫుల్మాలి మెరుపులు మెరిపిస్తుండగా లిచ్‌ఫిల్డ్, డాటిన్ వంటి ప్లేయర్లు గుజరాత్ సొంతం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.